


# చెంకీ సంచి

ఎం.జే. రామం

వేణు అప్పుడే ఆఫీసునుంచి ఇంటికి వచ్చి ఏదో ఇంగ్లీషు పత్రిక తిరగ వేస్తున్నాడు. దాంట్లో నానా చెత్తరాని వుంది. ఒక పెన్సిలు పూర్తిగా అరిగి పోయేవరకు గీస్తే ఎంత పొడవు గీత అవుతుందో. అది మైళ్ళలోను. గజాల్లోను. అంగుళాల్లోను వేరు వేరుగా ఇచ్చాడు ఎవడో ఓ మూల. ఎవరికి కావాలి ఇలాంటి విషయాలు? ఎవడో దరిద్రుడు ఇలాంటివి చదివి గొప్పగా ఏదో తెలిసినట్టు ఎప్పుడో నలుగురిలోను చెబుతాడు. అందుకే వస్తున్నాయి ఇలాంటి విషయాలు. అనుకొన్నాడు వేణు.

ఇంతవరకు కాఫీ తెచ్చి ఇచ్చే సూచన లేవీ వేణుకి కనపడ లేదు. అయితే ఇక మరి రాదన్నమాట. ఇంత కాఫీ గురించి అడుగుతే అమ్మ పంచదార లేదనో, కాఫీ గుండ అయిపోయిందనో చెప్తుంది. నోరు మూసుకొని వూరుకోవడం మంచిది. అలాగే నోరు మూసుకొని వూరుకొన్నాడు. కొంత సేపటికి లేచి వీధిలోకి బయలు దేరడానికి తయారయ్యాడు.

ఇంతలో వీధిలో రిక్షా ఆగింది. వరండాలో చదువుతున్న రవి. శ్యామల అంటే వేణు తమ్ముడు. చెల్లెలూను. కీచు గొంతుకలతో కేకలు పెట్టారు. "అన్నయ్యా, శాంతం పిన్ని వచ్చిందోయ్" అని

ఆహా వచ్చిందన్నమాట, అనుకొన్నాడు వేణు. వేణుకి ఈ ప్రపంచంలో ఏం జరిగినా ఆశ్చర్య పడవలసిన అవసరమేమీ లేదని ఒకనమ్మకం. అయినా ఇప్పుడెందుకు వచ్చినట్లు. ఏదైనా సంబంధం మోసుకొచ్చిందేమో. వెంటనే పొమ్మంటే బావుంటుంది. ఇంతలో అమ్మ వచ్చింది.

"ఎవర్రా వచ్చింది. శాంతేనా? నేను మధ్యాహ్నమే అనుకొన్నాను. ఆ నల్లకాకి అదేపనిగా అరుస్తూవుంటేను."

అప్పుడే అనుకొందిట అమ్మ! ఆ వెధవ కాకి ప్రతిరోజూ మధ్యాహ్నం అరుస్తూనే వుంటుంది.

"రావే. లోపలికిరా. గుమ్మంలోనే నిలబడి పోయావేం?" అమ్మ ఆందోళనగా ఆహ్వానించింది. వేణు చిరునవ్వుతో పలకరించాడు.

"అంతా కులాసాయేనా" అడిగింది శాంతం పిన్ని.

"ఫస్టుగా" అందరి తరఫునా చెప్పాడు రవి.

గుంట వెధవ వీడికేంతెలుసు. ఎంత చస్తున్నామో. అయినా పాపం వాడినెందుకు తిట్టడం. ఇప్పుడు చేయవలసిన పనిఏమిటో జ్ఞాపకం రావడంలేదు-ఆ. అదీ నేను వీధిలోకి తిరగడానికి వెళ్లాలి, అని తేల్చుకొన్నాడు వేణు.

అలాగే బయలుదేరాడుకూడాను.

అమ్మ పక్కకి పిలిచి చెవులో చెప్పింది కళ్ళు చిట్లించి బయలుదేరాడు వేణు. ఎక్కడైనా. వీలైతేనే. పదిరూపాయలు పుట్టించుకు రావాలిట! ఇవాళ రేపూనూ అప్పు అడుగుతే తంతున్నారు వూళ్ళో. అయినా ప్రయత్నం చేద్దాం.

ఖాతా కొట్లో ఒకే ఒక్క సిగరెట్టు తీసుకొని ముట్టించాడు. ఎటువెళ్దామా అని ఆలోచిస్తూ ఆ కొట్టుదగ్గరే ఒక సైకిలుంటే దాని మీద కాలుపెట్టి ఏదో మునిగిపోతున్నట్లు దాన్ని పరీక్షగా చూస్తూ మరీ ఆలోచిస్తున్నాడు, ఇంతలో ఆ సైకిలతను వేణుని

తెమ్మననేనా చెప్పకుండా సైకిలు లాక్కొని పోయాడు. ఎంత విస్సాటం. ఒహవేళ తను నిలకడతప్పి పడిపోయుంటే? అయినా వాడి సైకిలు జోలికి తనెందుకు పోయినట్లు? ఆ....అదీ....ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

చాలాఏళ్ళక్రితం నాన్నగారి సైకిలుపోయినప్పుడు, మరో పనీపాట లేకుండా కనపడ్డ సైకిలల్లా తమ దేమోనని చూస్తూ వుండే వాడు. పై వూరికి చదువుకి వెళ్ళిన తరువాత, అది బాగా తగ్గిపోయి, ఒక సైకిలు పోయినట్లుకూడా జ్ఞాపకంలేకుండా అయిపోయింది. ఇప్పుడు గాని మళ్ళా తిరగ బెట్టిందా. కొంప తీసి. నవ్వుకుంటూ బయలు దేరాడు.

పై వూరికి తను ఎందుకు వెళ్ళినట్లు? ఆ ప్రశ్న పంపించిన నాన్నగారే అడిగి సమాధానం లేదని కాబోలు మళ్ళీ వూరుకొనే వారు. ఎందుకేమిటి. బుద్ధిలేక.

"టౌను పక్క కెళ్ళద్దురా. డింగరీ

డాంబికాలు పోవద్దురా,

టౌనుపక్క కెళ్ళావో, డొనై పోతావో రబ్బీ నారంగసామీ.

అని హుషారుగాపాడటం మొదలెట్టాడు. అసలింతకీ ఇప్పుడు ఎవడిని అడగడం పది రూప్యములు. దండోరా వేయిస్తేనో?

"టౌను పక్కకెళ్ళద్దురా...." జోరుగా పాడుతూ నడుస్తున్నాడు.

"ఎక్కడికోయ్ అలాపారిపోతున్నావ్?" వెనకనుంచి వెంకట్రావ్ కేక. ఆగిచూశాడు ఇంతలో వెంకట్రావే కొత్త రాలీ సైకిలు మీద దగ్గరకొచ్చి ఆగాడు. వీడి సైకిలుని పరీక్షగా చూడకూడదు! ఇది కొత్తది. చస్తే నాన్నగారిది కాలేదు.



"ఏమిటోయ్, చెప్పావు కాదేం! ఎక్కడికి పారిపోతున్నావూ అంట" మళ్ళీ అన్నాడు వెంకట్రావ్. "అదేనోయ్.... మా పిన్ని వచ్చింది ఇవాళ సాయంత్రం." అదే కారణం అన్నట్లు చెప్పాడు.

"అయితే...."

"అదే, మా అమ్మ ఎక్కడైనా ఓ పది రూపాయలు తెమ్మంది. అందుకని బయలు దేరాను."

చచ్చాడు వెంకట్రావ్. అనుకొన్నాడు వేణు. కోరి కోరి కొరివితో తల బరుక్కొన్నాడు. అదిగో చూడు ఎలా మాడిపోతోందో వాడి మొహం. వీడిని ఇవ్వమని ఎవరడిగారు, అయినా చూద్దాం ఏం చెప్తాడో.

"పది రూపాయిలా?.... ఎక్కడికో ఎందుకు, నేనిస్తా నీకు నిజంగా అవసరం వుందంటే కాని, తెలివి తక్కువ ఖర్చు మాత్రం చేయకూడదు."

తెలివి తక్కువ ఖర్చు. వీడివుద్దేశం అదే కదూ. వీడెగరేసే డబ్బు ముందర తన ఖర్చు ఏ మాత్రం. అయినా నేనేం చేస్తే వీడికెందుకు- నా యిష్టంవుంటే పది రూపాయలుపెట్టి తాగేస్తాను. ఏమనుకున్నాడో.

"చూడు వెంకట్రావ్. నిన్ను పదిరూపాయలు నేను అడగలేదు. ఒకవేళ ఏదైనా అడిగితే, అవసరం తీర్చమని అడుగుతాను తప్ప నీ సలహా మాత్రం ఎప్పుడూ అడగను. అడగని సలహాలు ఇవ్వడం ఎంత మాత్రం ఉచితంకాదు."

"భేష్" ఏమనుకొన్నాడో ఏమో.. పది రూపాయలనోటు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.






ఇనీ వకందుకు మంచిదే. కష్టంలేకుండా పని జరిగిపోయింది. కాని తిరుగుముఖం పట్టకుండా ఇంకా మీదికి నడుస్తున్నాడు.

"టౌను పక్కకెళ్ళద్దురా, డింభకా లారి లాల్లు లోలొద్దురా" ఇష్టంవచ్చినట్లు పాడుతున్నాడు.

అవును. ఇప్పుడేం చేయడం? ఇంటికి ఇంతవేగం పోవడమేనా. వెధవ వెంకట్రావ్ ఎందుకలా అన్నాడు? టక్కుమని ఆగిపోయాడు వేణు ఓ దీపస్తంభందగ్గర. ఇది ఖర్చుపెట్టేస్తేనో? పెట్టవచ్చు.

ఒక్కసారి హుషారంతా కరిగిపోయింది. ఇంతవరకు వున్న హుషారుకు కారణం కూడా దొరికింది. పదిరూపాయలు పుట్టించడానికి మంచి కారణం ఒకటి ఇంతకు ముందు కనపడింది. అంటే అప్పుయిచ్చే వాడికి కారణం కావలసి వస్తుందనికాదు. తనకి తనుసమాధాన పరచుకోడానికి. అబద్ధం ఆడక్కరలేకుండా అడగడానికి. వీలుదొరికింది పిన్నిరాకవల్ల. డబ్బు దొరకగానే తెలివితక్కువ ఖర్చు పెట్టచ్చు. అందుకే తనకి తెలియకుండా ఈ హుషారు. కాని ఖర్చుపెట్టేముందు ఎంత విచారం! నేరకపోయి ఈపుడుగు బుర్రలోకిదూరింది. దీనికంతకీ వెంకట్రావే కారణం. ఇప్పుడేం చేయడం?

రాత్రి పదకొండున్నర అయింది. నిషా మెల్లిమెల్లిగా విడుగుతోంది. "ఇంత వేగంగా ఇంటికి వెళ్ళడం మంచిదికాదు" రాత్రికి కుమారం లాడ్జిలో పడుకొని పొద్దున్న అక్కడనుంచి తిన్నగా ఆఫీసుకిపోతే మంచిది. మధ్యాహ్నం కాకి అరిచే వేళకి ఇంటికి చేరవచ్చు. ఇలా అయిపులేకుండా



కటి రెండు రోజులు మాయమైపోవటం ఇంట్లో అలవాటే. మహా అయితే శాంతం పిన్ని ఇంట్లో వుండబట్టి అమ్మకి కొంచెం కష్టం కలగవచ్చు. కలగనీ.

కుమారం లాడ్జిలో చోటుదొరికింది. వాసన ఇంకా బాగా వస్తోందికాని వాళ్ళెవరూ నిద్రమత్తులో పోల్చినట్టులేదు.

దొరికిన పదిరూపాయలు ఖర్చుపెట్టేశాడు కాని, యిప్పుడు విచారం పట్టుకుంది వేణుకి. ఆ విచారంలోనే ఇటూ అటూ దొర్లుతూ రాత్రి ఏ రెండుకో మూడుకో పడుకున్నాడు.

పొద్దున్న కుమారం కుదిపి కుదిపి లేపాడు. టైము చూస్తే ఎనిమిదయింది. ఒక్క ఉదుటున గెంతి లేచాడు వేణు.

"చచ్చానురా. ఇంతవరకు నన్నెందుకు లేపలేదు?" కుమారం చెపుతున్న జవాబు వినిపించుకోకుండా ఇంటికి పరిగెత్తాడు. జోరుగా నడుస్తున్నాడే కాని వళ్ళంతా చితక్కొట్టినట్లుంది. గబగబా తెమిలి ఆఫీసుకి వెళ్ళాలి. అక్కడ మళ్ళా వెధవచాకిరి. ఎంతకీ తెమల్దు. ఈ ఒక్క రోజేకాదు. తనలాంటి వాళ్ళు తరతరాలుగా చేస్తున్నారు ఆ పనిని. ఇంకా చేస్తారు కూడాను. అయినా ఫరవాలేదు. పని మాత్రం వుంటుంది.

గుమ్మంలో అడుగుపెట్టాడు. "వచ్చేవా, వేణూ, రాత్రి ఎక్కడికి పోయినట్లు?" శాంతం పిన్ని అడిగింది.

"అన్నయ్య అలాగే వెళిపోతూవుంటాడు పిన్నీ. అది మాకు అలవాటే!" రవి తన తరఫున చెప్పాడు. వాడి జవాబులోంచి తప్పించుకుంటూ, నవ్వేసి వూరుకున్నాడు. ఇంతలో కాఫీతీసుకొని అమ్మవచ్చింది. అరే కాఫీ వచ్చిందే. ఎంతసైనా అమ్మ అసాధ్యురాలు. పదిరూపాయల సంగతి అమ్మ అడగలేదు. వేణు కాఫీ ఎక్కడనుంచి వచ్చిందని అడగలేదు.

భోజనం చేసి ఆఫీసుకి బయలు దేరుతూ వుంటే వేణు అమ్మ అంది. "బాబూ, డబ్బు కోసం ఎక్కువ ప్రయత్నం చేసి బాధపడకు. సుబ్రహ్మణ్యం మేష్టారుగారుసర్దారు. ఎలాగో ఈ రెండురోజులుగడిపేయవచ్చులే." ఎంతో సున్నితంగా. ఎంతో సహనంతో అంది. పాపం మాష్టారుగారిని అడిగిందన్నమాట. జీతం అందుకున్న మర్నాటి నుండి అప్పుకి బయలుదేరే సుబ్రహ్మణ్యం గారు డబ్బుసాయంచేశారంటే. వేణుకికళ్ళు చెమ్మగిల్లాయి. అంతా మంచివాళ్ళే. ఆఖరికి వెంకట్రావ్ కూడాను. ఒక్క తనే ఇలా తయారయి దగా చేస్తున్నాడు. జరిగిన సంగతంతా చెప్పేసి భోరుమని ఏడుద్దామనిపించింది అతనికి. కాని అలాంటి పనేం చేయలేదు. కళ్ళు మాత్రం చిట్లించకుండా ఆఫీసుకి బయలు దేరాడు. □□□

